

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల భయం పట్టుకుంది. డిసెంబరు నాటికి సిలబస్ పూర్తి కావల్సి ఉంది. కాగా ఈ ఏడాది నవంబరు నెల వచ్చినా సగం మాత్రమే పూర్తి కావడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది

'పది' గట్టెక్కేదెలా?



ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి సిలబస్ జిల్లాలో ఇప్పటి వరకు 50 శాతం మాత్రమే పూర్తయింది. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులతో సిలబస్‌పై తీవ్ర ప్రభావం చూపింది. యేటా డిసెంబరు నాటికి వంద శాతం సిలబస్ పూర్తి కావాల్సి ఉంటుంది. కాగా ఈ ఏడాది నవంబరు నెల సమీపించినా కేవలం 50 శాతం మాత్రమే సిలబస్ పూర్తి కావడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. గత ఏడాది సైతం పదో తరగతి ఫలితాల్లో జిల్లా చివరి నుంచి మూడో స్థానం మాత్రమే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. విద్యా సంవత్సరం అరంభమై ఐదు నెలలు గడుస్తున్నా సిలబస్ అంతంత మా త్రంగానే పూర్తి చేశారు. దీంతో నవంబరులో నిర్వహించాల్సిన ప్రత్యేక తరగ తుల కార్యాచరణను ఇంకా రూపొందించకపోవడంతో ఈసారి ప్రత్యేక తరగతుల నిర్వహణ ఆలస్యం కానున్నదని తెలుస్తోంది.

- ఇప్పటి వరకు 50 శాతమే పూర్తి
- బదిలీలు, పదోన్నతులతో ఆటంకం
- ఫలితాలపై చూపనున్న ప్రభావం
- ప్రత్యేక తరగతులపై కార్యాచరణ రూపొందించని విద్యాశాఖ

● బోధనపై ప్రభావం..

ఉపాధ్యాయుల ఖాళీలు, బదిలీలు, పదోన్నతులు, సెలవులు, ఉపాధ్యాయులకు శిక్షణలు, ఇతర పనుల బోధన పై ప్రభావాన్ని చూపాయి. డిసెంబరు నాటికి పదో తరగతి సిలబస్‌ను పూర్తి చేసి రివిజన్ తరగతులు నిర్వహించాల్సి ఉండగా ఇప్పటి వరకు కొన్ని విషయాల్లో చాలా పాఠశాలల్లో సుమా రు 50 శాతం మాత్రమే సిలబస్ పూర్తయినట్లు తెలుస్తోంది. మిగిలిన రెండు నెలల్లో సిలబస్ 100 శాతం పూర్తి చేసి జనవరి నుంచైనా రివిజన్ నిర్వహించాల్సి ఉంటుంది. కాగా మారుమూల మండలాల్లోని ఉన్నత పాఠ శాలల్లో సిలబస్ సక్రమంగా పూర్తి కాలేదని చెబుతున్నారు. ఇందుకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఎక్కువ కాలం సాగడం ప్రధాన కారణంగా పేర్కొంటు న్నారు. దాదాపు 270 మంది కొత్త ఉపాధ్యా యులు రావడంతో ఆ లోటు భర్తీ చేసేం దుకు అధికారులు దృష్టి సారించాల్సిన అవ సరం ఉంది.

డిసెంబరు నాటికి వంద శాతం పూర్తి..

- మరియాల ఉదయ్‌బాబు, జిల్లా పరీక్షల సహాయ కమిషనర్



పదో తరగతి సిలబస్ డిసెంబరు నాటికి వంద శాతం పూర్తి చేస్తాం. జిల్లాలో ఈ ఏడాది సుమారు 6,500 మంది విద్యార్థులు పదో తరగతి చదువు తున్నారు. సిలబస్ పూర్తి చేసి జనవరిలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తాం.

● సుమారు 6,500 మంది..

ఈ ఏడాది జిల్లాలో సుమారు 6,500 మంది పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారు. మార్చిలో విద్యార్థులకు వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 50 శాతం మాత్రమే పూర్తి కావడం జరిగింది. 100 శాతం సిలబస్ పూర్తి కావలంటే మరికొంత సమయం అవసరం. ప్రతి యేటా నవంబరు చివర, డిసెంబరు మొదటి వారంలోనే ప్రత్యేక తరగతులను విద్యాశాఖ చేపడుతుంది. కానీ ఈ ఏడాది సిలబస్ పూర్తి కాకపోవడమే కాకుండా ప్రత్యేక తరగతుల నిర్వహణకు కార్యాచరణ రూపొం దించలేదు. దీంతో ప్రత్యేక తరగతుల నిర్వహణ ఆలస్యం అయ్యే అవకా శాలు ఉన్నాయి. సిలబస్ పూర్తి చేసి ప్రత్యేక తరగతులను నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారుల ఆరాచకం ఆందోళనకరం

- ఎంపీ గొడెం నగేష్ - ఎమ్మెల్యే హరీష్‌బాబు దీక్ష విరమణ



హరీష్‌బాబుకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న ఎంపీ నగేష్

సిర్పూర్(టి), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అధికారుల ఆరాచకాలు ఆందోళనకరమని ఎంపీ గొడెం నగేష్ అన్నారు. మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాల యం ఎదుట ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సోమవారం నుంచి చేపట్టిన నిరవ ధిక దీక్షను మంత్రి శ్రీధర్ బాబు ఇచ్చిన హామీ మేరకు మంగళవారం విరమించారు. దీక్షకు ఎంపీ గొడెం నగేష్ ఎమ్మెల్యే హరీష్‌బాబుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఎంపీ గొడెం నగేష్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రోజు రోజుకు అటవీ శాఖ అధికారుల దౌష్టికం, ఆరాచకం, పెత్తనం పెరిగిందన్నారు. సిర్పూర్(టి) మండలంలోని బెంగాలీ క్యాంపునకు చెందిన ఏడుగురిని అడవిపందిని హతమార్చారని చెబుతూ చిత్ర హింసలు చేశారని తెలిపారు. రైతులు ఎంతో శ్రమ పడి వేసుకున్న పంటను అడవి పందులు నాశనం చేస్తే వారికి ఎంతో నష్టం జరుగుతుందని అన్నారు. అలాంటి సమయంలో అధికారులే పందులను హతమారుస్తామని చెప్పుకుంటూ వస్తున్నారని, మరి ఇప్పుడు రైతులపై కేసులు మోపడం ఎంత వరకు సమంజసమన్నారు. 2016 నుంచి రైతులకు వచ్చే తునికాకు రాయల్టీ ఇవ్వకుండా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, కంపా నిధులను దుర్వినియోగం చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ తాను చేపట్టిన దీక్ష రెండో రోజుకు చేరుకోగా సాయంత్రం మంత్రి శ్రీధర్ బాబు బాధ్యులైన డీఎఫ్‌వోను బదిలీ చేసి సిబ్బందిపై ర్యలు తీసుకుంటామని ఫోన్‌లో తెలిపారని చెప్పారు. మంత్రి హామీ మేరకు విరమిస్తున్నట్లు తెలిపారు. తనకు సహకరించిన పార్టీ నాయకులు, ప్రజలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, బాధిత కుటుంబాలు పాల్గొన్నా రు. కాగా దీక్ష విరమించే గంట ముందు అటవీ శాఖ కార్యాల యంలో పీసీసీఎఫ్, ఉన్నతాధికారులు పంపించిన విజిలెన్స్ అధికారి రాజశేఖర్ ఎమ్మెల్యేతో పాటు బాధిత కుటుంబాలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధారులకు అందజేస్తానని విజిలెన్స్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ రామానుజం, సీఐ రమేష్, ఎస్సై కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులకు మాజీ మంత్రుల పరామర్శ

వాంకిడి, నవంబరు 5: వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహాలక్ష్మి, జ్యోతి అనే విద్యార్థినులను మంగళవారం మాజీ మంత్రులు హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్ పరామ ర్శించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిను లతో, వారి తల్లి తండ్రులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని వరుసగా జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శనమని తెలిపారు.

మంత్రుల పరామర్శ

ఆసిఫాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహాలక్ష్మి, జ్యోతి అనే విద్యార్థినులను మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిడి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందజేయాలని సిబ్బందికి సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు

వాంకిడి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పీవో ఖుష్బూగుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అస్వస్థతకు గురైన ముగ్గురు విద్యార్థులు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని చెప్పారు. పది మంది డిశ్చార్జీ చేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో చేరిన విద్యార్థుల వైద్యం వారి తల్లితండ్రులకు ఆహారం ఖర్చులు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ చెల్లిస్తుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థజిల్లా అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు విద్యార్థులకు రూ.7 లక్షలు ఖర్చు చేశామని వివరించారు. విద్యార్థుల అస్వస్థతకు కారణమైన నీరు, ఆహార నమూనాలను పరీక్షలకు పంపగా తాగునీటి పరీక్షలో ఎలాంటి కలుషిత సంకేతాలు లేవని తెలిపారు. ఆహారానికి సంబంధించిన పరీక్షా ఫలితం రావాల్సి ఉందని తెలిపారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతాం

వాంకిడి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతామని డీటీడీవో రమాదేవి అన్నారు. ఆసిఫాబాద్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న విద్యార్థినులను మంగళవారం ఆమె పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాంకిడి ఆశ్రమపాఠశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా వాంకిడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థి నుల ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్యం కొంత మేరకు నిలకడగా ఉందన్నారు. మంచిర్యాల ప్రైవేట్ ఆసుపత్రిలో చికత్స పొందుతున్న విద్యార్థిని శైలజను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. సోమవారం రాత్రి అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఆసిఫాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు.

తెలుగు భాషపై పట్టు సాధించాలి



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎంఈవో ప్రభాకర్

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషపై సంపూర్ణ పట్టు సాధించాలని ఎంఈవో ప్రభాకర్ తెలిపారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు భాషపై పట్టు పెంచుకోవాలన్నారు. ఉన్నత చదువుల్లో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్సు ఉపాధ్యాయులు పర్శ చంద్రశేఖర్, కోఆర్డినేటర్ పద్మశ్రీ, తెలుగు బోధన రిసోర్స్ పర్సన్ రాజమణి, రమేష్ పాల్గొన్నారు.

రెబ్బెన, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాపై ప్రతి ఒక్కరూ సామర్థ్యం పెంచుకోవాలని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఎఫ్ఎల్ఎన్ తెలుగు భాషపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మౌఖిక భాషా, అభివృద్ధి, ధ్వని గుర్తింపు తదితర వాటిపై అక్షరాల ద్వారా పిల్లలకు అవగాహన పరుచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, మహేశ్వర రావు, సతీస్, సుబ్బారావు, ప్రశాంతి, ఎం రాజేష్, ఎం దేవేందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రీడింగ్ స్కిల్‌ను రూపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో జయ రాజు అన్నారు. మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వన్ డే ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ అనే అంశం మీద శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అండ్ రూం టు రీడ్ ఇండియా ట్రస్ట్ సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యుడు వెంకటేశ్వర్, ఆర్పీ విఘ్నేష్, స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ సంపత్, సీఆర్పీ రవీంద్రనాథ్, మహేష్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సెపక్ తక్రా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డి

రెబ్బెన, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సెపక్ తక్రా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రిక్కల శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డీఎల్ నర్సింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన ఎన్నికల్లో 2024-28 ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ ఆర్ నారాయణరెడ్డితో పాటు ఇతర సంఘాల నాయకులు అభినందించారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీ ఫార్మాసిస్టు సస్పెన్షన్

కాగజ్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈఎస్ఐ డిస్పెన్సరీ ఫార్మాసిస్టు మురళిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయని ఈఎస్ఐ సూపరింటెండెంట్ డాక్టర్ జగన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది రోజుల క్రితం కరీంనగర్‌లోని ప్రైవేట్ మెడికల్ దుకాణంలో ఈఎస్ఐ డిస్పెన్సరీకి సంబంధించి మందులను విక్రయిస్తుండగా అధికారులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి సస్పెండ్ చేశారని తెలిపారు.

కెరమెరికి చేరుకున్న పాదయాత్ర

కెరమెరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పండరీపూర్‌లో కొలైవన విట్టల్‌రుక్మాయి ఆలయానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా యేటా నిర్వహించే పాదయాత్ర రెండో రోజు మంగళవారం కెరమెరి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా శివాలయం ఆవరణలో గ్రామస్తులు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ శంకర్, పాండురంగ్, పోశెట్టి, బాపుజీ, లక్ష్మణ్, అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కెరమెరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలోని మోడీ గ్రామంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిలో నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అటెండర్, అసిస్టెంట్‌కుక్, స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ నెల 8 లోగా దరఖాస్తులు ఎంఆర్సీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నష్ట పరిహారం అందజేత

వాంకిడి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం సవ్వాతి గ్రామ పంచాయతీ పరిధిలోని అంతాపూర్ గ్రామానికి చెందిన యజమానికి సిడాం తాను మంగళవారం రూ.15 వేల నష్ట పరిహారం చెక్కును ఎఫ్ఆర్వో గోపిచంద్ సర్దార్ అందజేశారు. ఇటీవల చిరుతపులి దాడిలో లేగదూడ మృతి చెందడంతో యజమానికి చెక్కును అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి సరోజ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కౌటాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియ అధికారులకు సమన్వయంతో వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కౌటాల మండలం సాండ్‌గాం రైతు వేదికలో మంగళ వారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై రైతులు, వ్యవసాయ, విస్తరణ అధికారులు, కేంద్రాల నిర్వహకులు, సహకార శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. వరి ధాన్యం కొనుగోళ్లకు జిల్లాలో 34 కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ నెల 15వ తేదీ తరువాత ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వివరాలను ఆ ప్రాంత రైతులకు సమాచారం తెలియజేయాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకు వచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి ఒక క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నందని చెప్పారు. క్వాలిఫైయర్ మిషన్ ద్వారా నిర్ధారించిన సన్నరకం ధా న్యానికి బోనస్ చెల్లించనున్నామని తెలిపారు. ఈ యంత్రాలపై వ్యవసాయ విస్తరణాధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టార్పాలిన్లు, గన్ని సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం తూకం అయిన తరువాత వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా సరిహద్దు ప్రాంతాలైన వాంకిడి, హుడ్కిలి, వెంకట్రావుపేట, గూడెం వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆదివాసీ సంస్కృతిని భావితరాలకు అందించాలి

ఆసిఫాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల దండారీ (గుస్సాడీ) సంస్కృతిని కాపాడి భావితరాలకు అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి ప్రభుత్వం అందించిన దండారీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దీపావళి పండగను పురస్కరించుకుని నిర్వహించే దండారి ఉత్సవాలకు ప్రభుత్వం దండారికి రూ.15 వేల చొప్పున అందిస్తున్న దని చెప్పారు. ఆదివాసీలు దండారి సంస్కృ తిని కాపాడి భావితరాలకు అందించాలని తెలిపారు. జిల్లాలోని ఆసిఫాబాద్ మండలంలో 22 దండారీలకు రూ.3.30 లక్షలు, తిర్యాణిలో 37 దండారీలకు రూ.5.55 లక్షలు, వాంకిడిలో 30 దండారీలకు రూ.4.50 లక్షలు, జైనూరులో 50 దండారీలకు రూ.7.50 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. కెరమెరిలో 36 దండారీలకు రూ.5.40 లక్షలు, లింగాపూర్‌లో 20 దండారీలకు రూ.3లక్షలు, సిర్పూర్ (యూ)లో 41 దండారీలకు రూ.6.15 లక్షలు, కాగజ్‌నగర్‌లో 9 దండారీలకు రూ.1.35 లక్షలు, రెబ్బెనలో ఒక దండారికి రూ.15 వేల, సిర్పూర్(టి)లో ఒక దండారీకి రూ.15 వేల మొత్తం రూ.37.05 లక్షల చెక్కు లు పంపిణీ చేశారు. గుస్సాడీ కళను ప్రపంచానికి పరిచయం చేసిన కనక రాజు అనారోగ్యంతో మృతి చెందడం బాధకరమని విచారం వ్యక్తం చేశారు. జంగుబాయి, జోడేఘాట్, మార్లవాయి ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి జిల్లా యవతకు ఉపాధి అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందులో భాగంగా జోడేఘాట్ ప్రాంతం ఆధునీకరణకు పర్యాటక మంత్రిత్వ శాఖ రూ.4.8 కోట్ల నిధులు మంజూరు చేసిందని, త్వరలో పనులు చేపట్టి పూర్తి చేసే విదంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ యేటా ఘనంగా నిర్వహించే దండారీ ఉత్సవాలకు ప్రభుత్వం మరింత చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం రెబ్బెన గ్రామానికి చెందిన ఆదివాసీ విద్యార్థిని మానేపల్లి శిరీషకు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మంగళవారం 25వేల రూపాయలు అందజేశారు. ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో శిరీష జాతీయ ర్యాంకు సాధించి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. కాగా విద్యార్థిని తల్లిదండ్రులు ఓ కోళ్ల ఫాంలో దినసరి కూలీలుగా పని చేస్తుం డడంతో విషయాన్ని తెలుసుకున్న తు డుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య ఎస్సై రామరావుకు సమాచారం ఇచ్చారు. ఎస్సై రామారావు తన మిత్రులు డల్లాస్(యూఎస్ఏ)కు చెందిన దుర్గం రాజ్‌కుమార్, లోకేష్ సహకారంతో సమకూర్చి మంగళవారం ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శిరీషను శాలువాతో సత్కరించి అభినందించారు.

అటవీ అధికారుల విచారణ

చింతలమానేపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జెల్లి రేంజ్ పరిధిలోని దిందా, బండలేటి, తదితర బీట్‌లలో అటవీ శాఖాధికారుల బృందం సభ్యులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ బీట్‌లలో పలు చెట్లు నరికి వేతకు గురయ్యాయని, అన్యాక్రాంతంగా చెట్లు నరికి వేతకు గురి కావడమే కాకుండా అక్రమ రవాణా జరిగినట్లు ఆరోపణలు రావడంతో బృందం సభ్యులు, డీఎఫ్‌వో ముకుంద్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఆరోపణలు రావడంతోనే ఇక్కడి బీట్‌లలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారించామని, నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. అక్రమార్కులపై చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో నెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు



రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఆసిఫాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం రాష్ట్రస్థాయి నెట్ బాల్ సబ్‌జూనియర్ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆలీబిన్ అహ్మద్, కార్యదర్శి తిరుపతి హాజరయ్యారు. ఈ మేరకు బాలుర, బాలికల క్రీడ జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8 నుం చి 10 వరకు నిర్మల్ నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహేశ్వర్, పీడీలు, పీఈటీలు ఎడుకొండలు, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: సిద్దిపేట జిల్లాలో ఈనెల 8 నుం చి 10 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఆసిఫాబాద్ క్రీడా పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్‌స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన మౌనిక, అమూల్య, అనిత, అలేఖ్య, ఇంద్రజ, యోచన, మధురక్షి, మహేష్, ప్రణయ్, కీర్తన్, సాయి, చరణ్, వివేక్ లు ఎంపికైనట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి సాంబశివరావు, కోచ్‌లు అరవింద్, సాయి, రాకేష్ తదితరులు తెలిపారు.

న్యూస్ బాక్స్

బ్యాండ్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం

బెల్లంపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా బ్యాండ్ ఓనర్స్ అసోసియేషన్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బందెల మురళీ, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా తాజుద్దీన్, కోశాధికారిగా సర్వర్ మియా, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శిగా రాజమౌళి, గౌరవాధ్యక్షులుగా యశ్వంతరావు, సలహాదారులుగా పీర్‌మహ్మద్, సలీంలను ఎన్నుకున్నారు.

'దాడి సరికాదు'

లింగాపూర్ నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్యాంనాయక్‌పై దాడి సరికాదని మాజీ ఎంపీటీసీ రాథోడ్ మలిరామ్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్‌పై విశ్వప్రసాద్, అనిల్‌గౌడ్‌తో పాటు అతడి అనుచరులు దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. జాదవ్ రమేశ్, జాదవ్ జాదు, రాథోడ్ బాపూరావు, అనిల్, రామారావు పాల్గొన్నారు.

హామీ నిలబెట్టుకోవాలి

ఆసిఫాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు కోరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి అపాయింట్‌మెంట్ తేదీ ప్రకటించాలని మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రాన్ని అందజేశారు. పలువురు మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఉపేందర్, దివాకర్, శంకర్, అశోక్, మోహన్, హరికృష్ణ పాల్గొన్నారు.

సర్వేపై శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాధన సర్వే 2024పై మంగళవారం జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ పరిశీలించారు. హెచ్‌ఎంలు విద్యార్థుల అభ్యసన ఫలితాలు సాధించేలా బోధించాలన్నారు. జిల్లా విద్యాశాఖ నుంచి అందిన అభ్యసన ప్రదీపికలు ఉపయోగించి షెడ్యూల్ వారీ గా వినియోగించుకోవాలని చెప్పారు. రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

కులగణనలో నమోదు చేసుకోవాలి

ఆసిఫాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బౌద్ధులు కులగణన సర్వేలో కులమున్న చోట మహర్‌గా మతం ఉన్నచోట బౌద్ధం అని నమోదు చేసుకోవాలని బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ అన్నారు. మంగళవారం దీక్ష భూమిలో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. తిరుపతి, దిలిప్, సుధాకర్, రవిదాస్ పాల్గొన్నారు.

కడంబా అటవీ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు

కాగజ్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని కడంబా అటవీ ప్రాంతాన్ని రాష్ట్ర విజిలెన్స్ పీసీసీఎఫ్ మేరు, సీసీఎఫ్ మంచిర్యాల శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ మంగళవారం పరిశీలించారు. ట్రెంచ్‌లు, కందకాలను పరిశీలించారు.

ఊట నీటితో వరి సాగు

- వానాకాలం, యాసంగిలోనూ పుష్కలంగా నీరు
- ప్రతికూల పరిస్థితుల్లో సైతం 50 ఎకరాల్లో పంట


పంట పొల్లాల్లోకి వెళ్తున్న ఊట కాలువ


ఊట నీరుతో సాగవుతున్న వరి

పెంచికలపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పెంచికలపేట మండలంలోని బొంబాయిగూడ- పెంచికలపేట ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న బుడుగుల ప్రాంతంలో దశాబ్దాలుగా రైతులు ఊట నీటితోనే వరి సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో 15 మంది రైతులు సుమారు 50 ఎకరాలకు పైనే వరి పంటను అటవీ ప్రాంతం నుంచి వచ్చే ఊట నీరు ఆధారంగానే సాగు చేస్తున్నారు. ఇందులో పెంచికలపేట, బొంబాయిగూడ, ఎల్కపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు. ఏడాది పాటు నీరు పారుతుండడం వల్ల ఆ ప్రాంత మంతా చిత్తడిచిత్తడిగా ఉంటుంది. బురదమయంగా ఉన్న పొల్లాల్లోకి ట్రాక్టరు. వరి కోత మిషన్ వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. కోతకు వచ్చిన వరి పంటను పూర్తిగా కూలీలతోనే కోయించాల్సి ఉంటుంది. కోత తీసిన అనంతరం దాన్ని పొడిగా ఉన్న ప్రాంతానికి రైతులు తరలించేందుకు చర్యలు తీసుకుంటారు. ఇలా ప్రతికూల పరిస్థితుల్లోనూ రైతులు వరి పంట సాగు చేయడం విశేషం.


చెక్ డ్యాంలో నిలువ ఉన్న ఊట నీరు

30 ఏళ్లుగా వరి సాగు..

30 ఏళ్లగా బుడుగుల ప్రాంతంలో ఊట నీరుతో వరి పంట సాగు చేస్తున్నాను. ఐదు ఎకరాలకు నీరు పుష్కలంగా అందుతోంది. దిగుబడి బాగానే వస్తున్నా పంట కోసేందుకు కూలీలు దొరకడం ఇబ్బందిగా ఉంది. కోసిన పంటను సైతం వెంట వెంటనే తడి లేని ప్రాంతానికి తరలించాల్సి ఉంటుంది.

- పాగిడే శివరాం, బొంబాయిగూడ



అంతరిక్ష అన్వేషకులను ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

ఆసిఫాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరం అంతరిక్ష అన్వేషికులను ప్రోత్సహించాలని డీఈవో యాదయ్య అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళయాన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ విద్యార్థుల్లో అంతరిక్ష అన్వేషణపై ఇలాంటి వర్క్‌షాపులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా మంగళయాన్ ప్రాముఖ్యత విజయాలను ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రఘునందన్, జిల్లా పరీక్షల సహాయ కమీషనర్ ఉదయ్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన మురుగుకాలువ పరిశీలన

కాగజ్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణ ప్రధాన మురుగుకాలువను మున్సిపల్ కమిషనర్ అంజయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ సలీం మాట్లాడుతూ ఈ కాల్వ సమీపంలో మూల మలుపు ఉందని, ఈ మార్గంలో కళాశాలలు, పాఠశాలలున్నట్టు తెలిపారు. మూల మలుపు నుంచి గోడ నిర్మాణం చేపట్టాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ త్వరలోనే సర్వే చేయించి గోడ నిర్మాణం కోసం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఈ రమాదేవి పాల్గొన్నారు.

రక్షణ చర్యలపై ఆరా


అధికారుతో మాట్లాడుతున్న డీడీఎంఎస్ ప్రేంకుమార్

రెబ్బెన, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో మంగళవారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సెఫ్టీ అధికారి ప్రేంకుమార్ పర్యటించి రక్షణ చర్యలపై ఆరా తీశా రు. ఖైరిగూడ ఓసీ పని స్థలాలకు చేరుకొని బ్లాస్టింగ్ విధానాన్ని పరిశీలించారు. బ్లాస్టింగ్ సమయంలో తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈస్ట్ వ్యూ పాయింట్ నుంచి బ్లాస్టింగ్‌ను వీక్షించారు. రక్షణ చర్యలపై అధికారుకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీవో ఎం నరేందర్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, మేనేజర్ జె.శంకర్, సెఫ్టీ ఆఫీసర్ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

రెబ్బెన, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏఐటీయూసీ పని చేస్తోందని గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు మొగిలి గోలేటి కేఎల్ మహేంద్ర భవన్‌లో ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి బి జగ్గయ్య, పార్టీ పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషశైనారావు,రాజేష్, దేవరకొండ, దివాకర్, చంద్రశేఖర్, రాజయ్య పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

ఆసిఫాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఐకేపీలో పని చేస్తున్న వీవోఏలకు కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. వీవోఏల సమస్యలు పరిష్కరించాలని మంగళవార డీపీఎం యశోదకు వినతి పత్రాన్ని అందజేశారు.

గుడుంబా స్వాధీనం

బెజ్జూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని లంబాడీగూడ గ్రామంలో ఎస్సై విక్రం ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా గ్రామానికి చెందిన లావుడే తిరుపతినాయక్ ఇంట్లో ఐదు లీటర్ల గుడుంబాతో పాటు 50 లీటర్ల బెల్లం పానకం లభ్యమైంది. తిరుపతినాయక్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రం తెలిపారు. గ్రామాల్లో గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కలెక్టర్‌ను కలిసిన శ్రీరాంపూర్ జీఎం

శ్రీరాంపూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ మంగళవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూల మొక్క అందించారు. ఈ సందర్భంగా ఉపరితల గనులు, భూ సేకరణ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్ర మంలో ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మీ, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న మేనేజర్‌కు సన్మానం

శ్రీరాంపూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆర్కే 5 మేనేజర్‌గా పనిచేసి శాంతిగని ఏజెంటుగా పదోన్నతిపై వెళ్తున్న అబ్దుల్ ఖాదిర్‌ను ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం అధికారులు సన్మానించారు. రెండేళ్లుగా ఆయన ఆధ్వర్యంలో ఆర్కే 5 గనిలో వంద శాతం ఉత్పత్తి సాధిం చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏరియా జీఎం సూర్యనారాయణను టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ మంగళవారం సన్మానించారు. అనంతరం ఆర్కే 7 గ్రూపు ఏజెంట్‌గా పనిచేసి ఎస్ఓ టు జీఎంగా వెళ్తున్న రాముడు, ఇటీవల ఏరియా సెక్యూరిటీ అధికారిగా నియమితులైన జక్కారెడ్డిని సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో టీబీజీకేఎస్ నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, వెంకటరెడ్డి, వికాస్, ఉత్తేజ్‌రెడ్డి, రమణారెడ్డి, నరేష్, సాల్మన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా సెక్యూరిటీ అధికారికి..

రెబ్బెన, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా జీఎం ఆఫీస్ బెల్లంపల్లి ఏరియా సెక్యూరిటి ఆఫీసర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఉమాకాంత్‌ను మంగళవారం సెక్యూరిటీ డిపార్టుమెంటు పిట్ కార్యదర్శి కందుల మల్లేష్, గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షులు బయ్య మొగిలితో పాటు తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జగ్గయ్య, శేషశైనా రావు, జూపాక రాజేష్, మీస చంద్రశేఖర్, దేవరకొండ దివాకర్, డి.రాజయ్య, ఎస్.కె.జాంగిర్, తపన్ మండల్, గొర్ల శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ చంద్రయ్య, శమీ, సురేష్‌పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం

శ్రీరాంపూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సింగరేణి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం మంగళవారం జీఎం కార్యాలయ ఆవరణలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం త్వరలో జరగ బోయే బీసీ మహాసభ విజయవంతానికి తాత్కాలిక సంప్రదింపుల కమిటీని ఏర్పాటు చేశారు. ఎస్‌వీ రాజేశ్వర్ రావు, మోత్కూరి కొమురయ్య, బరపటి మారుతి, గొర్ల సంతోష్, సార్ల శ్రీష్, నామాల శ్రీనివాస్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఆర్కే న్యూటెక్ గని సందర్శన


ఫైవ్ స్టార్ చిహ్నాన్ని ఆవిష్కరిస్తున్న శుక్లా

శ్రీరాంపూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ఆర్కే న్యూటెక్ గని ని ఫైవ్ స్టార్ రేటింగ్ బృందం మంగళవారం సందర్శించింది. బృంద సభ్యులు డీవీ సుబ్రహ్మణ్యం(ఓఎస్‌డీ, సీసీఓ రీజనల్ కార్యాలయం, కొత్తగూడెం), అవి నాశ్ శుక్లా(చీఫ్ మేనేజర్, సీసీఓ బిలాస్‌పూర్), అజయ్ కుమార్(అసిస్టెంట్ ప్రొఫెసర్, వరంగల్ నిట్), రఘుకుమార్(జీఎం-రక్షణ, బెల్లంపల్లి రీజియన్), శేషుబాబు (ఎస్ఈ, ఎస్ఎంఎంసీ, సీపీ అండ్ పీ), శ్రీనివాస్(మేనేజర్, తాడిచర్ల ఓసీపీ), తదితరులు ఉదయం గని వద్దకు రాగా, వారికి ఏజెంట్ రాముడు, మేనేజర్ స్వామిరాజు, ఇతర అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. గని ప్రధాన ద్వారం నుంచి సెక్యూరిటీ విభాగం సిబ్బంది, రెస్క్యూ టీం సభ్యులు, గని రక్షణ కమిటీ సభ్యులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఉదోగులు బతు కమ్మ ఆటలు, పీరీలు, స్కౌట్స్ అండ్ గైడ్స్ కవాతు, కళాకారుల ప్రదర్శనలతో వారిని గనిలోనికి తోడ్కొని వచ్చారు. బృంద సభ్యులు గనిలోని ఉత్పత్తి, రక్షణ చర్యలు, ఎస్ఎంపీ, ఎస్ఓపీ అమలు, సున్నా ప్రమాదాలు, తదితర అంశాలను పరిశీలించారు. గనిలోని పని స్థలాలకు వెళ్లి ఉద్యోగులతో మాట్లాడారు. వారి పనితీరు, వృత్తి నైపుణ్యాలను తనిఖీ చేశారు. ప్రమాదాల నివారణకు తీసు కుంటున్న రక్షణ చర్యల గురించి వాకబు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఫైవ్ స్టార్ చిహ్నాన్ని బృంద సభ్యుడు అవినాశ్ శుక్లా ఆవిష్క రించారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీ యూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్య క్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీ ఎం(ఫైనాన్స్) మురళీధర్, ఇందారం ఓసీపీ పీవో ఏవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరుతో ఉద్యోగాలు కోల్పోవద్దు

శ్రీరాంపూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విధులకు గైర్హాజరై ఉద్యోగాలు కోల్పోవద్దని ఆర్కే 6, 7 గనుల మేనేజర్లు ఈ తిరుపతి, జె తిరుపతి అన్నారు. 75 మస్టర్ల కంటే తక్కువగా ఉన్న ఉద్యోగులకు మంగళవారం ఆయా గనులపై కౌన్సెలింగ్ నిర్వహించారు. గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకున్నారు. డ్యూటీకి రాకపోవడం వల్ల ఆర్థికంగా కుటుంబానికి కలిగే నష్టాలను వివరించారు. విధులకు సక్రమంగా హాజరై ఉద్యోగాలను కాపాడుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్కే 6 గని సంక్షేమాధికారి సురేందర్, పిట్ కార్యదర్శి సంఘం సదానందం, ఉత్తమ ఉద్యోగి బీరయ్య, ఆర్కే 7 గని రక్షణాధికారి సంతోష్ రావు, సంక్షేమాధికారి శంతన్, ఏఐటీయూసీ నాయకులు కిషన్ రావు, మారపెల్లి సారయ్య, ఉత్తమ ఉద్యోగి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా పోటీల్లో సత్తా చాటాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం, అధికారులు

మందమర్రి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియా పోటీల్లో సింగరేణి సత్తాను చాటి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించాలని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన కంపెనీ లెవల్ ఫుట్‌బాల్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 11 ఏరియాల నుంచి హాజరైన జట్ల క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సీఎండీ బలరాం ఆదేశాల మేరకు క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఆయా క్రీడలకు సంబంధించి మెరుగైన కోర్టు లను సింగరేణి వ్యాప్తంగా ఏర్పాటు చేశామని చెప్పారు. పతకాలు సాధించే ప్రతీ క్రీడాకారుడికి తగిన విధంగా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యానారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు ఫైడీశ్వర్, స్పోర్ట్స్ సమన్వయకర్త మాస్కుల కార్తిక్, సూపర్వైజర్స్ జాన్‌వెస్లీ, అశోక్, రమేశ్, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, శివకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి కార్మికుడి ఆత్మహత్య


మొగిలి (ఫైల్)

మందమర్రి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూడో జోన్‌కు చెందిన సింగరేణి కార్మికుడు గురిజాల మొగిలి(60) మంగళవారం మందమర్రి రామకృష్ణాపూర్ రైల్వేస్టేషన్ మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏరియాలోని కేకే ఓసీలో ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. రాత్రి విధులకు వెళ్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. అప్పటికే ఆత్మహత్య ప్రాంతం వద్ద ఉన్న పోలీసులు ఫోన్ లిఫ్ట్ చేసి సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇండ్లలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఫెరోజ్ అలీ అలియాస్ సయ్యద్ ఫెరోజ్ అలీ, సయ్యద్ ఫరూక్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నయాగావ్ గ్రామానికి చెందిన, నస్పూర్ ఫ్లడ్‌కాలనీలో నివాసముంటున్న గంగాధర్ మిట్టల్ గైక్వాడ్‌లు కొంతకాలంగా తాళం వేసి ఉన్న ఇండ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. పలు ప్రాంతాల్లో ఇండ్లలో చోరీలకు పాల్పడమే కాకుండా బైకులను దొంగిలించినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం ఐబీ చౌరస్తాలో వాహన తనిఖీలు చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి మూడు మోటార్ సైకిల్స్ హెచ్‌ఎఫ్ డీలక్స్ (టీఎస్02ఈబీ1571), హెచ్‌ఎఫ్ డీలక్స్ (టీఎస్01ఈబీ9941), హీరో ప్యాషన్ (టీఎస్01ఈఏ0794), 28 గ్రాముల బంగారు ఆభరణాలు, రాగి సామగ్రి స్వాధీనం చేసుకొన్నామని సీఐ తెలిపారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్‌పై పీడీ యాక్టు నమోదు


పీడీయాక్టు ఉత్తర్వులను అందజేస్తున్న సీఐ

మంచిర్యాల అర్బన్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్‌పై పీడీ యాక్టు నమోదు చేస్తూ మంగళవారం రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన కుంట శ్రీనివాస్ కొన్ని నెలలుగా మంచిర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్యాయత్నం, భూకబ్జాలు, బెదిరింపులకు, దాడులకు పాల్పడుతున్నాడని తెలిపారు. దీంతో అతనిపై 4 కేసులు నమోదు చేసి జైలుకు పంపించామని, గతంలో రామగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్య కేసులో జైలుకు వెళ్లినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో పీడీ యాక్టు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు. ఉత్తర్వులను పట్టణ సీఐ ప్రమోద్‌రావు ఆదిలాబాద్ జైలులో ఉన్న నిందితుడు శ్రీనివాస్‌కు అందజేసి అక్కడి నుంచి చర్లపల్లి జైలుకు తరలించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని సీపీ హెచ్చరించారు.

ప్రమాదవశాత్తు ప్రాజెక్టులో పడి వ్యక్తి మృతి


ధర్మయ్య(ఫైల్)

కన్నెపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకునిపేట పంచాయతీలోని బొగడగూడెంకు చెందిన బోర్ల ధర్మయ్య(49) పాల్వాయి ప్రాజెక్టులో పడి మృతిచెందాడు. 24 రోజుల క్రితం ధర్మయ్య ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం ఓ రైతు పత్తి చేనులో లుంగీ, చొక్కా, చెప్పులు కనబడడంతో రైతు కుటుంబీకులకు సమాచారం అందించాడు. ధర్మయ్య కుమారులు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ గంగారాం ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రాజెక్టులో పడి ఉంటాడని గ్రహించి గజఈతగాళ్ళతో గాలింపు చేపట్టగా ధర్మయ్య అస్థిపంజరం లభ్యమైంది. ఎస్ఐ మాట్లాడుతూ పూల కోసం వచ్చిన ధర్మయ్య ప్రమాదవశాత్తు ప్రాజెక్టు నీటిలో పడి మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దండేపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మ్యాదరిపేట బస్టాండ్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. లక్షెట్టిపేట మండలం హన్మంతుపల్లికి చెందిన బోనాల మహేష్(29) ద్విచక్ర వాహనంపై గుడిరేవులోని అత్తగారింటికి వెళ్లి లక్షెట్టిపేట వైపునకు వస్తున్నాడు. మ్యాదరిపేట బస్టాండ్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టడంతో మహేష్ కిందపడగా తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

తాండూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఏసీపీ రవికుమార్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఏసీపీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీట్స్, హిస్టరీ షీట్స్ లిస్టును తనిఖీ చేసి వారిపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగా రౌడీషీట్స్‌లో ఎవరైనా ఉంటే ప్రపోజల్స్ పంపించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాల న్నారు. సీసీఎస్‌టీఎస్ అప్లికేషన్‌లో ఎప్పటికప్పుడు డేటాను నమోదు చేయాలన్నారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట సీఐ కుమారస్వామి, ఎస్ఐ కిరణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

షీటీంపై అవగాహన

జైపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం షీటీంపై సభ్యులు శ్రావణ్‌కుమార్, జ్యోతిలు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బాలికలను, మహిళలను వేధింపులకు గురి చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈవ్‌టీజింగ్, వేధింపులకు పాల్పడినా షీటీం నెంబర్ 6303923700కు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆసుపత్రికి తరలింపు

జైపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వేలాల గ్రామానికి చెందిన ఆకుదారి కత్తెరసాల కొన్ని రోజులుగా మతి స్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ శ్రీధర్ మంగళవారం కత్తెరసాలను అదుపులోకి తీసుకుని చెన్నూరు మెజిస్ట్రేట్ రవి ఎదుట హాజరు పర్చగా ఆయన హైద్రాబాద్ ఎర్రగడ్డ ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. దీంతో అతన్ని హైద్రాబాద్‌లోని ఎర్రగడ్డ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

లెదర్ పార్కు స్థలం కబ్జాకు గురి కాకుండా చూడాలి

మందమర్రి టౌన్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): లెదర్ పార్కుకు కేటాయించిన స్థలం కబ్జాకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని మంగళవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు జీఎం దేవేందర్‌కు వినతిపత్రం అందించారు. 15 సంవత్సరాల క్రితమే స్థలాన్ని కేటాయించారని తెలిపారు. ఇటీవల ఓ కాంట్రాక్టర్ స్థలం కబ్జా చేయడంతోపాటు అందులో నుంచి రోడ్డు వేయడానికి చూస్తున్నాడని, దీనిపై స్పందించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. సునీల్ మాదిగ, తుంగపిండి రాజేష్ పాల్గొన్నారు.

నేటి నుంచే కులగణన...

3వ పేజీ తరువాయి..

మొబైల్ నంబర్, దివ్యాంగులు అయితే రకం, వైవాహిక స్థితి, స్కూల్లో చేరే నాటికి వయసు, స్కూల్ రకం, అత్యున్నత విద్యార్హత, ఏ మీడియం చదివారు, స్కూల్ మానేస్తే దానికి సంబంధించిన వివరాలు ఒకటి నుంచి 19వ కాలమ్ వరకు అడుగుతారు.

జిల్లాలో 8 లక్షల పై చిలుకు కుటుంబాలు

సమగ్ర కుటుంబ సర్వే చేపట్టేందుకు జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో మొత్తం 8,20,137 కుటుంబాలను అధికారులు గుర్తించారు. ఆయా కుటుంబాల్లో సర్వే చేరసేందుకు మొత్తం 1981 ఎన్యూమరేటర్లను నియమించారు. ప్రతి మండలంలో గ్రామ పంచాయతీల వారీగా ఒక్కో ఎన్యూమరేటర్ కనీసం 150 కుటుంబాల్లో సర్వే చేపట్టేలా చర్యలు తీసుకోనున్నారు. ఎన్యూమరేటర్ నియామకంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ ఈ విషయంలో మంగళవారం రాత్రి వరకు ఎలాంటి స్పష్టత రాలేదని జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ మహ్మద్ ఖాసిం తెలిపారు. ఎన్యూమరేటర్లుగా పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఏఈఓలను ఇప్పటి వరకు నియమించారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



సర్వే సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. మంగళవారం పద్మశాలి భవన్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వేపై అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని, కుటుంబాల పూర్తి వివరాలను సేకరించాలన్నారు. ప్రతీ ఇంటి నుంచి ఖచ్చితమైన వివరాలను సేకరించాలన్నారు. సర్వేకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోతే మరోసారి ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. వివరాలు సేకరించిన తర్వాత ఇండ్లకు స్టిక్కర్ అంటించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుంటుబ ఇంటింటి సర్వేపై ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో, తహసీల్దార్‌లు మాట్లాడుతూ సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. మండలంలో 90 ఎన్యూమరేటర్ బ్లాకులను కేటయించి, 64 మంది సూపర్‌వైజర్‌లను నియమించామన్నారు.

ఘనంగా అభయాంజనేస్వామి విగ్రహ ప్రతిష్టాపన

కన్నెపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టేకులపల్లి గ్రామ పంచాయతీలోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్టాపన ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సామూహిక నవగ్రహ హోమం నిర్వహించారు. వేద పండితులు గోవర్ధనగిరి అనంతచార్యుల ఆధ్వర్యంలో విగ్రహాల శోభాయాత్ర, గణపతి పూజ, పుణ్యాహవచనం యాగశాల ప్రవేశం, జలాధివాసం, నవగ్రహ కుంభ స్థాపన, ఫలాదివా సం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పత్తి ఏరేందుకు పక్క రాష్ట్రాల కూలీలు



కర్నూలు నుంచి జన్నాపూర్‌కు పత్తి ఏరడానికి కుటుంబాలతో వచ్చిన కూలీలు

- జిల్లాలో వేధిస్తున్న కూలీల కొరత
- ఆంధ్ర, మహారాష్ట్ర నుంచి తీసుకువస్తున్నరైతులు

బెల్లంపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పత్తి పంటను అధికంగా సాగు చేస్తారు. ఒకేసారి పత్తి పంట



దేరాల సమీపంలో నిల్వ ఉన్న నీటిని తీసుకువెళ్తున్న కూలీలు

చేతికి రావడంతో కూలీలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. పత్తి ఏరడానికి కూలీల కొరత వేధిస్తుండడంతో చేసేదేం లేక జిల్లా రైతులు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి పత్తి ఏరడానికి కూలీలను తీసుకువస్తున్నారు. ప్రస్తుతం పత్తి ఏరుతుండడంతో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు దాదాపు 500 కుటుంబాల నుంచి కూలీలు ప్రత్యేక వాహనాల్లో జిల్లాకు వచ్చారు.

● పెరుగుతున్న సాగు విస్తీర్ణం... కూలీల కొరత

జిల్లాలో యేటా పత్తి సాగు పెరుగుతోంది. ఈ ఏడాది జిల్లాలో 1.85 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేశారు. గత ఏడాది కంటే 20వేల ఎకరాల్లో సాగు పెరిగిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పత్తి పంట రైతు లందరికి ఒకేసారి చేతికి వస్తుండడంతో పత్తి ఏరేందుకు కూలీల కొరత ఏర్పడుతోంది. ఒక్కోసారి కూలీలు లభించకపోవడంతో పత్తి చేన్లలోనే ఉంచాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

● ఆంధ్ర, మహారాష్ట్రల నుంచి కూలీలను తీసుకువస్తున్నరైతులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా నుంచి, పోల్‌కల్, గూడూరు, పోతిగల్లు, కృష్ణగిరి, వెంకటగిరి తదితర ప్రాంతాలతోపాటు మహారాష్ట్రలోని నాందేడ్, ఇతర ప్రాంతాల నుంచి పత్తి ఏరడానికి కూలీలు జిల్లాకు వస్తున్నారు. పత్తి ఏరడానికి వచ్చిన కూలీలకు కిలోకు రూ.10 నుంచి 15 వరకు రైతులు చెల్లిస్తున్నారు. పలు కుటుంబాలు భార్య పిల్లలతో వాహనాల్లో వచ్చారు. ఊరి చివరలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. పంట దిగుబడి వచ్చిన రైతులు ఫోన్ ద్వారా సమాచారం అందించి వాహనాలకు అయ్యే ఖర్చులను సైతం చెల్లిస్తారని కూలీలు పేర్కొన్నారు. తమ ప్రాంతాల్లో కూలీ పనులు లేకపోవడంతో ఇక్కడకు వస్తున్నట్లు తెలిపారు. పత్తి చేనులోకి ఉదయం 6 గంటలకు వెళ్లి సాయంత్రం వరకు పత్తి సేకరిస్తామని పేర్కొంటున్నారు.

మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చాను



నేను పది ఎకరాలకు పైగా పత్తి సాగు చేశాను. ప్రస్తు తం పత్తి చేతికి రావడంతో ఏరడానికి స్థానికంగా కూలీలు లేకపోవడంతో మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి తీసు కువచ్చాను. వారికి స్థానికంగా స్థలం చూపించి నివాసాల ను ఏర్పాటు చేసుకోమన్నాం. రైతులందరికి ఒకేసారి పత్తి పంట చేతికి రావడంతో కూలీల కొరత ఏర్పడుతోంది. యేటా ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకు వస్తున్నాం.

-సదయ్య, రైతు, చర్లపల్లి

న్యూస్ బాక్స్

ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు

మంచిర్యాల అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ డిగ్రీలో ప్రవేశాల గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించామని సెంటర్ కోఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేయాలనుకునే అభ్యర్థులు మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిప్లమా పూర్తి చేసిన వారు అర్హులని, బీఏ, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ, బీజెడ్‌సీ, కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల వారు 7382929719, 7780708354 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ముగిసిన దండారీ ఉత్సవాలు

కాసిపేట, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు గిరిజన గూడాల్లో సందడి చేసిన దండారీ ఉత్సవాలు మంగళవారం కొలబోడి కార్యక్రమం నిర్వహించిన అనంతరం ముగిశాయి. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల్లో భాగమైన గుస్సాడీ దండారీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గిరిజన పూజారులు ముగింపు పూజలు నిర్వహించారు. గిరిజన పటేల్‌లు, దండారీ ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

కొలవార్‌ను ఎస్టీగా నమోదు చేయాలి

కన్నెపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుల గణన సర్వేలో కొలవార్‌ను ఎస్టీగా నమోదు చేయాలని సంఘం మండల అధ్యక్షుడు కొడిపె వెంకటి మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ జోగయ్యకు వినతిపత్రం అందించారు. మన్నె, మన్నెవు, మన్నెవార్ కాకుండా తమ కులాన్ని కొలవార్ ఎస్టీగా అధికారులు నిర్ధారించాలన్నారు. వెంకటేష్, లక్ష్మీనారాయణ, సురేష్, నాగులు, పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

వేమనపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుయ్యారంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు పశు వైద్యులు సుప్రియ, పవన్‌కుమార్‌లు తెలిపారు. వారు మాట్లాడుతూ 215 గేదెలకు, 275 ఆవులు, ఎద్దులకు టీకాలు వేశామన్నారు. సిబ్బంది అస్లాం పాషా, గోపాలమిత్ర శ్రీకాంత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు





నస్పూర్‌లో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు, మంచిర్యాలలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

నస్పూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలో నాగుల చవితి సందర్భంగా మహిళలు మంగళవారం పుట్టల వద్ద పూజలు నిర్వహించారు. పుట్ట వద్ద నైవేద్యాలు, పండ్లు, పాయసం, పాలను సమర్పించారు. ఆలయాల్లోని నాగదేవత ప్రతిమలకు పాలతో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి చల్లంగా చూడమని వేడుకున్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినాన్ని మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మల్లన్న స్వామి దేవాలయాలు, పాముల పుట్ట వద్ద మహిళలు పాలుపోసి ప్రత్యేక నైవేద్యం, పసుపు కుంకుమలతో నాగదేవతకు పూజలు చేశారు. కుటుంబ సభ్యులు చల్లాగా ఉండాలని, పాడి పంటలు బాగాపండాలని పూజలు చేశారు.

గర్మిళ్ల (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలో నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. పాత మంచిర్యాల రామాలయం శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాము పుట్టలో పాలు పోసి ఉసిరి చెట్టు వద్ద సామూహిక వన భోజనాలు చేశారు. చున్నంబట్టివాడలో నాగులమ్మ దేవాలయంలో నాగుల చవితి సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పుట్టలో పాలు పోశారు. కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడెంలోని నాగులమ్మ ఆలయంలో భక్తులు ఘనంగా నాగుల చవితిని నిర్వహించారు. పుట్టకు పూజలు చేసి పాలు పోసి నైవేద్యాలను సమర్పించారు. అలాగే బోనాల పండగను నిర్వహించారు. బోనాలను సమర్పించారు. బక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

జైపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణ అందరి బాధ్యత అని భూగర్భ జల శాఖ జిల్లా అధికారి లావణ్య, సహాయభూజల భౌతిక శాస్త్రవేత్త గణేష్‌లు పేర్కొన్నారు. మంగళవారం ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భూగర్భ జల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందారం పారిశ్రామిక ప్రాంతమని, నీటిని నిలువ చేసుకోవడం, పొదుపుగా వాడుకోవడం ముఖ్యమన్నారు. వర్షం నీటిని వృథాగా పోనివ్వకుండా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు నీటి వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యాసరచన పోటీలు నిర్వహించగా గెలుపొందిన శిరీష, రాజవర్ధన్, నవీనలకు బహుమతులు అందజేశారు. భూగర్భ జల శాస్త్రవేత్త దివ్య, ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు సత్తిరెడ్డి, గోపగాని రవీందర్, రమేష్, సంధ్య, కనకయ్య పాల్గొన్నారు.

ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విష్ణువర్ధన్‌రావు



మంచిర్యాల అర్బన్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల సంఘం ట్రస్మా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాపోలు విష్ణువర్ధన్‌రావు నియమితులయ్యారు. ఈనెల 4న హైదరాబాద్ చర్లపల్లిలో జరిగిన ట్రస్మా ఎగ్జిక్యూటీవ్ కమిటీ సమావేశంలో కార్యవర్గసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అడ్వైజర్‌గా కస్తూరి పద్మచరణ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా యార్లగడ్డ బాలాజీ, వైస్ ప్రెసిడెంట్‌గా సురభి శరత్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా అఖిలేందర్‌సింగ్, రాంవేణులను ఎన్నుకున్నారు. విష్ణువర్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ట్రస్మా అధ్యక్షుడు సిద్ధయ్య, ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి చంద్రమోహన్ గౌడ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి మల్లేశం

- సాధనతో క్యారికేచర్ ఆర్టిస్టుగా రాణింపు

మంచిర్యాల అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సుద్ద ముక్కలపై కళాకృతులు, క్యారికేచర్ ఆర్టిస్టుగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణిస్తున్నాడు బెల్లంపల్లి పట్టణంలోని 2ఇంక్లైన్‌బస్తీకి చెందిన మాటేటి మల్లేశం. వృత్తి రీత్యా హెడ్‌కానిస్టేబుల్‌గా కొనసా గుతూ ప్రవృత్తిగా చిత్ర కళను ఎంచుకున్నాడు. చాక్ పీస్‌లను అందమైన ఆకృతులుగా మలుస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు.

మహాత్మాగాంధీ, నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్, గౌతమబుద్ధుడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, స్వామివివేకానంద లాంటి మహనీయుల బొమ్మలను సుద్దముక్కలపై చెక్కారు.



సుద్దముక్కలతో తయారుచేసిన బాటిల్, గ్లాస్, షూ, హెల్మెట్, కప్పులు, హిందూ, క్రైస్తవ, ముస్లిం చిహ్నాలు

క్యారికేచర్ ఆర్టిస్టుగా...

ఇటీవల కాలంలో ట్రెండింగ్‌గా నిలుస్తున్న క్యారికేచర్ ఆర్ట్‌ను ఆన్‌లైన్ వీడియోల్లో చూస్తూ నేర్చుకున్నాడు. 5 నిమిషాల్లో బొమ్మను క్యారికేచర్ చిత్రంగా గీస్తున్నాడు. పుట్టినరోజు, పెళ్లిరోజు సందర్భంగా పెన్సిల్ ఆర్ట్‌తో వారి బొమ్మలను వేసి బహుమానంగా అందిస్తున్నాడు.

పర్యావరణంపై మక్కువ

పర్యావరణంపైనే కూడా ఆయనకు మక్కువ ఎక్కువే. ఇంటి మిద్దెపై ఆర్గానిక్ పద్ధతులతో కూరగాయల సాగు చేస్తున్నాడు. వినాయక చవితి సందర్భంగా పర్యవరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియ జేసేందుకు మట్టి విగ్రహాలను తయారు చేసి సన్నిహితులకు పంపిణీ చేస్తున్నాడు.

కళలంటే ఇష్టం



చిన్నతనం నుంచే కళలన్నా, కళాకృతుల తయారీ, చిత్రలేఖనం ఇష్టం. ఎలాంటి శిక్షణ లేకుండానే సొంతంగా సాధన చేసేవాడిని. స్కూల్‌లో నేను వేసే కళాకృతులకు, గీసే బొమ్మలకు బహుమతులు రావడంతో అభినందిస్తుండేవారు. పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఖాళీ సమయం దొరికినప్పుడల్లా సాధన చేస్తూ కొత్త ఆవిష్కరణలు చేయడం అలవాటుగా మారిపోయింది.

- మాటేటి మల్లేష్



మల్లేశం ఇంటిపై కూరగాయాల సాగు







మల్లేశం గీసిన క్యారికేచర్, పెన్సిల్ ఆర్ట్ చిత్రాలు

క్రీడా సమాచారం

కబడ్డీ క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న సంఘ సభ్యులు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులను కబడ్డీ అసోసి యేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, డీవైఎస్ఓ రాజ్‌వీర్, ఒలింపిక్ అసోసియే షన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా, డీఈఓలు అభినందించారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లా రాచాలా గ్రామంలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లాకు తృతీయస్థానం లభించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత కోటపల్లి జట్టు



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న మాజీ జడ్పీటీసీ

వేమనపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేతనపల్లి యువజన సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఐదు మండలాల క్రికెట్ టోర్నమెంట్‌లో కోటపల్లి జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం ఫైనల్ మ్యాచ్ కోటపల్లి-కేతనపల్లి జట్లు తలపడగా విజేత కోటపల్లి జట్టుకు రూ.20 వేల నగదు, షీల్డ్, రన్నర్ కేతనపల్లి జట్టుకు రూ. 10 వేల నగదు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్‌కుమార్ బహుమతులు అందించారు. పోటీల నిర్వాహకులు పాల్గొన్నారు.


క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులు

బెల్లంపల్లిరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులో ఈ నెల 2న నిర్వహించిన అండర్ 14, 17 ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ బాలుర ఎంపిక పోటీల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల కాసి పేట విద్యార్థులు పాల్గొని 21 మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపాల్ సం తోష్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పీడీ హరీష్, పీఈటీ రాజేందర్‌లు అభినందించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
3
బుధవారం 6 నవంబరు 2024



న్యూస్ బాక్స్

పోక్సో కోర్టు ప్రత్యేక ప్రాసిక్యూటర్‌గా రాంబాబ్



గర్మిళ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోక్సో కేసులను వేగవంతంగా విచారణ చేయడానికి ఫాస్ట్ ట్రాక్ న్యాయస్థానానికి ప్రత్యేక ప్రాసిక్యూటర్‌గా ఏ. రాంబాబ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు బార్ అసోసియేషన్ సభ్యులు,న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా కిషన్‌కుమార్



శ్రీరాంపూర్, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): ఆర్యవైశ్య సంఘం నస్పూర్ మండల అధ్యక్షుడిగా రావి కిషన్ కుమార్ నియమితులయ్యారు. ఆయన వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్నారు. లక్సెట్టిపేటలోని ఆర్యవైశ్య భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా మహాసభ సమావేశంలో నియామకాన్ని రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ప్రకటించారు. తన నియామకానికి సహకరించిన ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి ముక్తా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.


ఆర్టీసీ బస్సులు నడిపించాలి

భీమారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి ఆరేపల్లి మీదుగా మద్దికల్, కొత్తపల్లి వరకు, కొత్తపల్లి మీదుగా సుద్దాల, కిష్టంపేట, చెన్నూరుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిని హైద్రాబాద్‌లో కలిసి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి విన్నవించారు. గతంలో ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం ఉండేదన్నారు. బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మాజీ సర్పంచు గడ్డె రాంరెడ్డి, నాయకులు వేల్పుల శ్రీనివాస్, అశోక్, సందీప్, రమేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ ఏర్పాటు హర్షనీయం

మందమర్రి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజా ప్రభుత్వం బీసీ కమిషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని బీసీ కుల సంఘాల జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ బీసీల కులగణనతోనే అభివృద్ధి సాధ్యమని, కమిషన్ ఏర్పాటుతో బీసీలకు మేలు జరుగుతుందన్నారు నెల రోజుల్లో రిపోర్టు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించడం గొప్ప విషయమన్నారు. నాయకులు రాజేశం, వెంకటేశ్వర్‌గౌడ్, శంకరయ్య, శ్రీనివాస్, పాల్గొన్నారు.

నేటి నుంచి కులగణన




- సమగ్ర కుటుంబ సర్వేకు ఏర్పాట్లు పూర్తి
- 75 ప్రశ్నలతో సర్వే పత్రం విడుదల
- 60 రోజుల్లో ప్రక్రియ పూర్తికి కార్యాచరణ
- ఆస్తులు, అప్పులూ చెప్పాల్సిందే

మంచిర్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సర్వే ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుండగా, 60 రోజుల్లో పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించారు. ఇండ్లకు నంబర్లు వేసే పని ఇప్పటికే పూర్తికాగా, ఇక కుటుంబ సర్వే ప్రారంభం కానుంది. ఈ సర్వే ద్వారా రాష్ట్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ ముఖ చిత్రం తేటతెల్లం కానుందని అభిప్రాయపడుతున్నారు. 2014 ఆగస్టు 19న ఒక రోజులో గత ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. దీంతో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న వారంతా ఆ రోజు తమ తమ స్వస్థలాలకు చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేప డుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో సభ్యులందరూ ఉండాల్సిన అవసరం లేదు. కుటుంబానికి సంబం ధించిన ఎవరో ఒకరు వివరాలు చెబితే ఎన్యూమరేటర్లు నమోదు చేసుకుంటారు.

75 ప్రశ్నలతో ఫార్మాట్...

75 ప్రశ్నలతో రూపొందించిన ఫార్మాట్లో ప్రతీ కుటుంబానికి ఒక సీరియల్ నంబర్‌తో పాటు జిల్లా, మండలం, గ్రామం, ఆవాసాలకు కోడ్ నంబర్లు కేటాయించారు. పార్ట్ 1లో 2 నుంచి 11 కాలమ్స్‌లో సాధారణ వివరాలు నమోదు చేస్తారు. కుటుంబ యజమానితోపాటు సభ్యుల వ్యక్తిగత వివరాలను నమోదు చేస్తారు. ఆధార్ నంబర్ తప్పనిసరి కాదు. 12 నుంచి 19 కాలమ్స్‌లో విద్య వివరాలు తెలుసుకుంటారు.

మిగతా 5వ పేజీలో..



అన్ని వివరాలు చెప్పాల్సిందే...

సర్వేలో కులంతో పాటు ఆదాయం, ఆస్తులు వంటి వ్యక్తిగత వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది. మొత్తం 75 ప్రశ్నలతో రూపొందించిన ఫార్మాట్ ద్వారా రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని నమోదు చేయనున్నారు. తెలంగాణలో ఆయా కులాల జనాభా ఎంత? ఒక కుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉన్నారు? వారు ఏం చదువుకున్నారు? ఏం ఉద్యోగం చేస్తున్నారు? ఎంత సంపాదిస్తున్నారు? వారికి ఉన్న ఆస్తిపాస్తులు ఏమిటి? వాటిని ఎలా సంపాదించారు? ఇప్పటి వరకు ఏఏ పథకాల ద్వారా లబ్ధిపొందారు? వంటి ప్రశ్నలకు కచ్చితమైన సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నస్పూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను కార్యాలయ ఏవో, విద్యా శాఖ సూపరింటెండెంట్‌కు అందించారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు దాసరి రాజేశ్వరి, ఎండీ రఫీయాలు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎనిమిది నెలల నుంచి కోడి గుడ్డు బిల్లులు చెల్లించడం లేదన్నారు. మెనూ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పీ ఎఫ్, ఈఎస్ఐలను అమలు చేయాలన్నారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. నాయకులు రబియా, లక్ష్మి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు భవన నిర్మాణం చేపట్టాలి

మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడి మౌనదీక్ష



మౌనదీక్ష చేస్తున్న న్యాయవాది జగన్

మంచిర్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టుకు భవన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్ మంగళ వారం ఒకరోజు మౌనదీక్ష చేపట్టారు. జిల్లా కేంద్రం లోని ఐబీ చౌరస్తా వద్దగల హనుమాన్ విగ్రహం వద్ద ఆయన ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రి పదవి ఇవ్వాలని, అలాగే జిల్లా కోర్టు శాశ్వత భవన నిర్మాణానికి ప్రేంసాగర్‌రావు కృషి చేయాలని కోరారు. దీక్ష సమయంలో హనుమాన్ చాలీసా, భగవద్గీత పారాయణం చేశారు. జగన్‌కు జిల్లాలోని న్యాయవాదులు సంఘీభావం ప్రకటించారు. న్యాయవాదులు కొట్టె నటేశ్వర్, గోలి శ్రీనివాస్, రవికుమార్, భీమయ్య, ప్రదీప్‌చంద్ర, విజయ్, వినీత్, సోమరాములు పాల్గొన్నారు.

ఊట నీటితో వరి సాగు
- వానాకాలం, యాసంగిలోనూ పుష్కలంగా నీరు
- ప్రతికూల పరిస్థితుల్లో సైతం 50 ఎకరాల్లో పంట
4 లో

పత్తి ఏరేందుకు పక్క రాష్ట్రాల నుంచి కూలీలు
- జిల్లాలో వేధిస్తున్న కూలీల కొరత
- ఆంధ్ర, మహారాష్ట్ర నుంచి తీసుకువస్తున్న రైతులు
5 లో

ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి కృష్ణాదిత్య

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి కృష్ణాదిత్య అన్నారు. మంగళవారం మంచిర్యాల కలెక్టరేట్‌లో కలెక్టర్లు కుమార్‌దీపక్, వెంకటేష్ దోత్రె, అదనపు కలెక్టర్లు మోతిలాల్, దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావులతో కలిసి 2 జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యంలో తప్ప తాలు లేకుండా ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్రాల్లో తాగునీరు, నీడ, టార్పాలిన్‌లు, గన్నీ సంచులు, తేమ యంత్రాలు ఇతర సదుపాయ లతో సిద్ధంగా ఉండాలన్నారు. రైసుమిల్లుల్లో రిజిస్టర్‌లను స్పష్టంగా నిర్వహించాలని, రైసు మిల్లర్లతో ఒప్పందాల ప్రక్రియ పకడ్బందీగా ఉండాలన్నా రు. సన్నరకం, దొడ్డు రకం వడ్లకు వేర్వేరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల న్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదును జమ చేయాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో 326 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. కేంద్రాలకు అవసరమైనయంత్రాలు, పరికరాలు అందుబాటులో ఉంచామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం రాకుండా అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టి అక్రమ రవాణాను నియంత్రించేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు.

జన్నారం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేండ్లగూడ, మొర్రిగూడ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ధాన్యం కొనుగోలు జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత్య ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. దళారులను నమ్మి మోస పోవద్దని సూచించారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే ఐకేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్ అన్నారు. నాగసముద్రం, దండేపల్లిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. తాలు తప్ప లేకుండా ఆరబెట్టిన తర్వాతే ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. డీపీఎం వేణు గోపాల్, ఐకేపీ ఏపీఎం భూపతి బ్రహ్మయ్య, సీసీలు సురేందర్, లావణ్య, వీవోఏ విజయ, పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన



గూడెంలో స్వామి ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఆలయ ఈవో, సీఐ, ఎస్సై.

దండేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 13 నుంచి 15 వరకు జరిగే ప్రత్యేక కార్తీక మాస ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో సంకటాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆలయ పరిసర ప్రాంతాల్లో ఘాట్‌రోడ్డు, జాతర ఏర్పాట్లపై సీఐ అల్లం నరేందర్, ఎస్సై ఉదయ్‌కిరణ్, ఆలయ సిబ్బంది పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘాట్‌రోడ్డు నుంచి గుట్టపైకి స్వామి దైవ దర్శనం, గుట్ట కిందికి దిగేందుకు మరోదారి ఏర్పాటు చేశామన్నారు. మంచి నీటి వసతి, క్యూలైన్, క్లాక్ రూములు, ప్రసాదాల కౌంటర్లు, ప్రత్యేక దర్శనం టిక్కెట్ కౌంటర్, వాహనాల నియంత్రణ, పోలీసు బందోబస్తుపై చర్చించారు. కల్యాణ మండపం వద్ద భక్తులు సేద దీరేందుకు, వాహన పార్కింగ్ స్థలాలను వారు పరిశీలించారు. సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు కార్తీక పూజలను నిర్వహించారు. వందలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా స్వామి వ్రతాన్ని ఆచరించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

మంచిర్యాల డివిజన్‌లో పెద్దపులి సంచారం



- ఆదివారం మూడు ఆవులపై దాడి
- భయాందోళనలో అటవీ శివారు ప్రాంతాల ప్రజలు
- పులి సంరక్షణకు అటవీ అధికారుల చర్యలు
- పులికి హానీ తలపెట్టవద్దని ప్రజలకు అవగాహన



ముత్యంపల్లి అటవీ సెక్షన్ పరిధిలో పెద్దపులి అడుగు

కాసిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఫారెస్టు డివిజన్ పరిధిలోకి పెద్ద పులి వచ్చింది. ఆదివారం సాయంత్రం ముత్యంపల్లి సెక్షన్ మామిడిగూడలోని గోండుగూడకు చెందిన గిరిజన రైతు చిత్రు ఆవుల మందపై దాడి చేసి మూడు ఆవులను చంపింది. దీంతో పెద్దపులి వచ్చిన విషయం వెలుగులోకి వచ్చింది. ఇక్కడ సంచరిస్తున్న పెద్దపులి ఎస్ 12 మగ పులిగా అధికారులు భావిస్తున్నారు. నాలుగు నెలల క్రితం మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్ కుమరం భీంజిల్లా సిర్పూర్ టీ అడవుల్లోకి ప్రవేశించి కవ్వాల్ టైగర్ జోన్‌లోని ఖానాపూర్, పెంబి అటవీ క్షేత్రాల పరిధిలో సంచరించింది.

ఇటీవల హాజీపూర్ అటవీ శివారు ప్రాంతంలో కనిపించిన పులి మూడు రోజుల క్రితం మేడారం, బొక్కలగుట్ట, ముత్యంపల్లి, ర్యాలీగడ్‌పూర్, గురువాపూర్, దేవాపూర్ అటవీ శివారు ప్రాంతాల్లో కనబడినట్లు కొందరు పశువుల కాపర్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆవుల మందపై దాడి చేయడంతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో పత్తి రైతులు, వ్యవసాయ కూలీలు ఆందోళనకు గురవుతున్నారు. వేటగాళ్ళ ఉచ్చుల నుంచి పెద్దపులిని కాపాడేందుకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆహారం, నీరు, సురక్షిత ఆవాసం దొరికే వరకు పులి అడవి అంతా తిరుగుతుందని, పులికి హాని తలపెట్ట వద్దని గ్రామాల్లో అటవీశాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్ మాట్లాడుతూ మంచిర్యాల డివిజన్ పరిధిలో పెద్దపులి సంచరిస్తుందని, పులిని సంరక్షించు కోవడం అందరి బాధ్యత అన్నారు. పులి రోజు కు 60 కిలో మీటర్లు నడుస్తుందని, సురక్షిత స్థిర నివాసం ఏర్పర్చుకునే వరకు అడవంతా తిరుగుతుందన్నారు. సమీప గామాల ప్రజలు, పశువుల కాపర్లు అడవిలోకి వెళ్లవద్దని సూచించారు. పులి సంరక్షణకు చర్యలు చేపడుతున్నామన్నారు.

ఆవులకు నష్టపరిహారం అందజేత

ముత్యంపల్లి సెక్షన్ పరిధిలోని మామిడిగూడలోని గోండుగూడ అటవీ శివారు ప్రాంతంలో ఆవుల మందపై పెద్దపులి దాడి చేసి మూడు ఆవులను చంపింది. లక్సెట్టిపేట రేంజ్ లోని మేడారం సెక్షన్ పరిధి లోని అటవీ శివారు ప్రాంతంలోని మేతలకు వెళ్లిన ఆవుల మందపై దాడి చేసింది. దాడిని గుర్తించిన లక్సెట్టిపేట ఎఫ్ఆర్‌వో సుభాష్ ముత్యంపల్లి డిప్యూటీ ఎఫ్ఆర్‌వో నవీన్ నాయక్‌లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో పశువైద్యాధికారి తిరుపతి పంచనామాచేసిన అనంతరం పులి దాడి చేసి చంపినట్లు గుర్తించారు. దీంతో ఆవుల యజ మాని చిత్రుకు మంచిర్యాల అటవీ శాఖ అధికారులు రూ. 33 వేల నష్టపరిహారాన్ని మంగళవారం అందజేశారు. ఎఫ్ఎస్‌వో అహ్మద్ ఆలీ, ఎఫ్‌బీవో శ్రీనివాస్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఆవుల యజమానికి నష్టపరిహారం అందిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



దీక్ష చేస్తున్న తపస్ నాయకులు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర శాఖ ఇచ్చిన ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షలో భాగంగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఐబీ చౌరస్తాలో దీక్ష నిర్వహించారు. తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్ మాట్లాడుతూ 4 డీఏలు, పీఆర్సీ, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 23న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్మాగ్రహ దీక్ష చేపడుతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయ ఏఓకు అందజేశారు. చీర సమ్మయ్య, నీలేష్ కచ్వాల్, భారతీ అశోక్, నాగరాజు, సాంబయ్య, వరప్రసాద్ పాల్గొన్నారు.

సంచార ప్రయోగశాల



ప్రయోగాలు చేసి చూపిస్తున్న నిర్వాహకులు

చెన్నూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొక్కూరు గ్రామంలోని జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం జిజ్ఞాస సంచార ప్రయోగశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన పలు ప్రయోగాలను చేసి చూపించారు. మానవ శరీరానికి సంబంధించిన ప్రయోగాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం దత్తకుమార్, సంచార ప్రయోగాశాల నిర్వాహకులు సాయికుమార్, సంపత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.